# శృతిమించిన రాగం

ఎన్నో యుగాలుగా ఎదురు చూసిన మధుర క్షణం ఆసన్నమైంది. ఎన్నో మాసాల అనంతరం తిరిగి తన అర్థాంగిని కలుసుకోబోతున్నాడు. భార్య ఎలా వుంటుందో కూడా తనకు తెలియదు. తనకు తెలిసిందల్లా మధ్యాహ్నం వివాహం జరిగింది. సాయంకాలం నాలుగు గంటల రైల్లో ఆ వూరు వదలి వెళ్ళిపోయాడు. రెండు రోజుల అనంతరం ఢిల్లీలో ఇంటర్వ్యూ జరగటం, ఆ మరునాడే ఉద్యోగంలో చేరటం యివన్నీ సినిమాలో లాగా ఒకదానివెంట ఒకటి జరిగాయి.

అది ఆరునెలల క్రిందటి మాట. అందరి నోటి వెంట ఒకటేమాట.

కోడలు వచ్చిన వేళ చల్లటి వేళ అని, అందుకనే నాలుగు సంవత్సరాలుగా ఎంతో ప్రయత్నం చేసినా రాని ఉద్యోగం మూడు ముళ్ళూ పడ్డ మరుక్షణంలో అయాచితంగా లభ్యమైందంటే అది ఆ యింటి కోడలు అదృష్టం కాకపోతే మరి ఎవరిది?

అందరూ అదేమాట అన్నారు. తనూ అవునన్నాడు. ఆరుమాసాలు ఆరు యుగాలుగా గడిచాయి. ఈలోగా తన యిల్లాలికి ఎన్నో ఉత్తరాలు రాశాడు. భార్యమీద తనకున్న ప్రేమనంతా ఎన్నోసార్లు వెల్లడించాలని ఉత్తరం రాసేటప్పుడు అనుకునేవాడు.

కాని కలం ఏదో రాసేది. అది చదివితే నిర్లిప్తంగా నిర్వికారంగా ఉండేది. మనస్సే కాదు. మమత కూడా మూగబోయిందనిపించేది.

"జీవితమంతా చిన్న పిల్లలుగా వుండాలని కోరుకోవడం మనల్ని మోసం చేసుకోవడం రామం! నా జీవితాన్ని గురించి నేను ఒక నిర్ణయానికి వచ్చాను. నా పంథా నేను ఏర్పర్చుకున్నాను. నా లక్ష్యమేమిటో నాకు తెలుసు. నా గమ్యమేమిటో నాకు తెలుసు. నేను వాటిని చేరగలను, పొందగలను. నడిచే రైలులో కలిసిన ప్రయాణీకులం మనం. యీ స్నేహాలు, యీ అనురాగాలు మనకు మనం కల్పించుకున్న మాయలు రామం! నన్ను మరిచిపో. మగవాడిగా బ్రతుకు. ఒక ఆడపిల్ల కోసం నాశనం చేసుకోవలసినంత అల్పమైంది కాదు మీ మగవాళ్ళ జీవితం."

"నన్ను చిత్రవధ చెయ్యొద్దు జానకీ! నిన్ను ఎలా మరిచిపోను? మన చిన్ననాటి స్నేహాన్ని ఎలా మరచిపోను?"

"స్నేహాన్ని, ప్రేమని మరచిపొమ్మని నేను చెప్పటంలేదు రామం! మన ప్రేమ, మన స్నేహం ఎప్పుడూ శాశ్వతంగా వుంటాయి. నేను మరిచిపోమన్నదల్లా మనం కట్టుకున్న గాలిమేడలు."

"అవి గాలిమేడలా!"

"గాలిమేడలే. అవి కలలోని గాలిమేడలు. కల కరిగింది. మేడ కూలిపోయింది."

"జానకి! జానకి!"

రేడియో ఆగిపోయింది.

ఆసామితోపాటు ట్రాన్సిస్టరు కూడా రైలు దిగిపోయింది.

బిగ్గరగా రైలు కూసింది. రామం ఉలిక్కిపడ్డాడు.

రామం! జానకి!

జానకి! రామం!

ఎటుచూసినా ఎటువిన్నా యిదే ఆలాపన.

రైలు కదిలింది. అలనకాని వేగంతో పరుగెత్తి పోతుంది. గమ్యానికి యింకా పదహారు మైళ్లు.

సెలయేటి గలగలలాంటి చక్కటి నవ్వు.

వన్నె కొచ్చిన క్రొత్త పెళ్ళికూతురు ముఖంలో పాలనురగలాంటి చక్కటి నవ్వు. ప్రక్కన కూర్చున్న పెళ్ళికుమారుడి ముఖములో ఆనందంతో ఒక్కసారి వెయ్యి ఇంద్రధనుస్సులు వెల్లివిరిసాయి.

వారి వివాహంలో ఎంత ఆనందం ఉంది!!

జానక్యాః కమలా మలాంజలిపుటే యా పద్మరాగాయితాః

తన పెళ్ళి ముందు చిన్న గొడవలు జరిగాయి. ఇంటాబయటా కూడా అంతా శత్రువులే! కని పెంచిన తల్లితండ్రులే తన గర్భశత్రువులైయ్యారు. తను ఎంత చెప్పినా వినకుండా ససేమిరా అని అన్నారు.

అమ్మ చెప్పిన అభ్యంతరం ఎంత హాస్యాస్పదంగా వుంది! "అత్తాకోడళ్ళ పేర్లు ఒకటి కాకూడదు..."

అది శ్యామల పొరబాటేం కాదే! తను యింటపుట్టిన మొదటి ఆడపిల్లకు అమ్మవారి పేరు పెట్టడం అనాదిగా వస్తున్న ఆచారమేగా. తాతయ్య తన మొదటి కూతురుకు 'శ్యామల' అని పెడితే, మామయ్య కూడా తన పెద్దకూతురికి కూడా

అదే ఆచారం ప్రకారం అదేపేరు పెట్టాడు. అందులో ఎవరి తప్పు లేదే. ఎవరి నేరమూ లేదే.

ఏ విషయంలో కూడా అమ్మ మాటకు అంగీకరించని నాన్న యీ విషయంలో మాత్రం,

"మీ అమ్మకే యిష్టంలేని మేనరికం నేనెలా ఒప్పుకోను? నువ్వు యీ పిల్లని చేసుకోవడానికి ఏ మాత్రం వీల్లేదు" అని నిర్మొగమాటంగా చెప్పేశారు.

ఎవరిమీదనో కోపం! ఎవరిదో నేరం! శిక్ష మాత్రం శ్యామలకూ, తనకు!

వ్యాపారంలో నష్టం వచ్చి భాగస్థుల అన్యాయం వల్ల మామయ్య ఆస్తి పోగొట్టుకున్నందుకు శ్యామలకు యీ శిక్ష.

ఈనాడు తమకు కలిసివచ్చి మూడు పువ్వులు ఆరుకాయలుగా జీవితం గడిచి పోతున్నందుకు గర్వంతో అదృష్టంలో వెనుకబడిన మామయ్యకు, అతను చేసిన ఉపకారాలకు మనం చేసే ప్రతిఉపకారం యిదా?

కాదు! కాదు! కాదు! అని తనకు తెలుసు. కాని తెలిసికూడా చెయ్యగలిగిం దేమిటి? చేసిందేమిటి?

రైలు ఆగింది. స్టేషన్‌కు రవ్వంత దూరంలో ఒక మేడమీద వసారాలో ఒక యిరవై సంవత్సరాల అందమైన అమ్మాయి చంటిపిల్లవాడిని ముద్దులాడుతోంది. ఆ పిల్ల కట్టుకున్న కనకాంబరం రంగు నైలెక్సు పువ్వులచీర, క్రీమ్‌కలర్ సిల్కు జాకెట్టు ఎంత బాగున్నాయి! కనకాంబరం రంగు చూస్తుంటే నిన్న కనబడ్డ సన్యాసుల గుంపు గుర్తుకు వచ్చింది.

చీకూచింతాలేని బ్రతుకులు వాళ్ళవి! నేనూ నాది అనే మమకారాల బాధలు లేవు వాళ్ళకు!

ఒకవేళ తను కూడా సన్యసిస్తే!... తన వాళ్ళంతా గొడవ చేస్తారు. వీళ్ళను చూసి తను ఎందుకు భయపడాలి? వీళ్లు తనకు ఏమవుతారు?

మనసిచ్చేవాడు మిత్రుడు, ఆపదకు అడ్డుపడేవాడే ఆప్తుడు. వీళ్లు తనకు మనసూ యివ్వలేదు. యీ ఆపదకు అడ్డూపడలేదు. తన మనస్సు విరిచారు. తనకు ఆపదలు కలిగించారు.

తనకు అంతా వున్నారు కాని తను ఎవ్వరికీ ఏమీ కాదు. అందుకనే కాబోలు తను అందరికీ పరాయివాడు.

గుండెలు బ్రద్దలయ్యేలాగా ఏడుస్తూ రైలు కదిలింది.

మగవాళ్ళ మనసులు, మమతలు ఎంత చపలం! ఒక ప్రక్కన శ్యామలని గురించి బాధపడుతూనే జానకి మీద ఆశలు పెంచుకున్నాడు.

వీళ్లు నిజంగా ఎవరినైనా ప్రేమించగలరా? లేకపోతే ప్రేమించామని అపోహలో తమని తామే మోసం చేసుకుంటూ వుంటారా?

లేదు లేదు. శ్యామలని తను నిజంగా మనస్ఫూర్తిగా ఆత్మసాక్షిగా ప్రేమించాడు. మనసిచ్చి పుచ్చుకోవడం అనే మాటకు అర్థం వుండీ తను శ్యామలకే మనస్సు యిచ్చాడు.

నిజానికి తన బ్రతుకు నాశనం చేసింది అమ్మా! నాన్న! పిల్లల్ని ఎంతో ఆపేక్షగా, శ్రద్ధగా పెంచుతారని బంధుకోటిలో వాళ్ళకు ఎక్కడలేని మంచిపేరు... ఆ మంచితనం తన దగ్గరకు వచ్చేసరికి ఆమడ దూరం పారిపోయింది. ఎందుకనో?

శ్యామలా పుట్టినప్పటి నుంచి దాన్ని మా కోడలు, కోడలు అని వెంట వేసుకుని తిప్పి, తీరా సమయం వచ్చేసరికి, కోడలు కాదని మాట తప్పారు. ఆ పిల్లది వీళ్లకు చేసిన అన్యాయం ఏమిటి?

శ్యామలని ఎందుకని చేసుకోకూడదు? ఆ పిల్లకి వచ్చిన లోటేమిటి? అని అడిగితే నాన్న చెప్పిన సమాధానం ఎంత బాగుంది.

వయస్సు పెరిగి వృద్ధాప్యం వచ్చేసరికి యుక్తాయుక్త వివేక జ్ఞానం నాశనమై మనుష్యులు రాక్షసుడిగా మారిపోతారు కాబోలు.

నాన్న చెప్పిన సమాధానం ఏమిటో తెలుసా?

"మామయ్య పెళ్ళికాక పూర్వం బాగా పొగరుమోతుగా వుండేవాడట. క్రొత్త అల్లుడుగా మామయ్య వాళ్ళయింటికి వెడితే బావమరిది సజావుగా మాట్లాడలేదట. వాళ్ళ పిల్లని చేసుకుంటే తండ్రీ కొడుకులను చీలదీస్తాడట. అబ్బాయి మనకు కాకుండా పోతాడు."

ఈ అర్థంలేని మొండితనాన్ని ఎదుర్కొని తను ఎంతో హోరాహోరీగా పోట్లాడాడు. వాళ్ళుమాత్రం తన మాటని ఏ మాత్రం 'ఖాతరు' చెయ్యకుండా త్రోసిపుచ్చారు.

'ఇంట్లోంచి ఎక్కడికైనా వెళ్ళిపో. ఈ హడావిడి తగ్గిన తరువాత తిరిగి రావచ్చు' అని మిత్రులు సలహా యిచ్చారు.

"నువ్వు శ్యామలని భార్యగా పొందాలంటే ఇంతకంటే వేరే గత్యంతరం లేదు" అని అన్నారు.

'శ్యామలా నువ్వూ ఎక్కడికైనా పారిపోయి రిజిష్టర్ మ్యారేజి చేసుకోండి' అని కూడా అన్నారు.

ఆ పని చేస్తే దానివల్ల వచ్చే పర్యవసానం విషయం ఆలోచించగానే తన తల్లి తండ్రులు, శ్యామల తల్లిదండ్రులకు వచ్చే అపకీర్తిని గురించి మనస్సున మసలగానే ఆ తలపే తనని అశక్తుణ్ణి చేసింది.

ఈ బలహీనతని ఆసరాగా తీసుకుని పెద్దవాళ్ళు తనని అణగ త్రొక్కివేశారు.

శ్యామలతో తను ఎంత చనువుగా వున్నా, ఆ పిల్ల మీద ఎంత అధికారం చెలాయించగలిగినా, ఆ వ్యక్తి తన భార్య రూపంలో తన జీవన భాగస్వామిగా తన కష్టసుఖాలలో భాగం పంచుకుంటుంది అనేది ఎందువల్లనో మొదటినుంచి కూడా తనకు సందేహాన్ని కలిగిస్తూ వచ్చింది.

ఆ రోజు రాత్రి విపరీతంగా వర్షం కురుస్తోంది. "అమ్మాయి మేడమీద దీపం తీసుకురా" అని అత్తయ్య అన్నది. తనూ, శ్యామలా మేడమీదకి వెళ్ళారు. మెట్లు మీద తను వుండగా, దీపం తీసుకురావటానికి ఒంటరిగా శ్యామల లోపలికి వెళ్ళింది. దీపం తీసుకుని మెట్ల దగ్గరకు వచ్చింది ఇంతలో బ్రహ్మాండమైన మెరుపులు, వెంటనే పిడుగు పడటం యివన్ని లిప్తకాలంలో జరిగిపోయాయి. చేతిలోని లాంతరు ద్రొల్లుకుంటూ కిందపడి నిఠారుగా నిల్చుంది. శ్యామల ముందుకు బోర్లబొక్కలా పడింది. తను పరుగెత్తి పట్టుకోకపోతే మెట్లమీద నుంచి ద్రొల్లిపోయేది.

శ్యామలని గట్టిగ గుద్దుకున్నాడు. శ్యామలా తనని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడిచింది. ఎవరు ఎంత సముదాయించినా వినలేదు.

ఆ క్షణంలోనే ఎందుకనో గాని హఠాత్తుగా అనిపించింది. గుండె బిగుసుకుని పోయినట్టు అనిపించింది.

శ్యామలా తనకు దక్కదేమో? శ్యామల తనది కాదేమో? ఇదేమాట మనసున ఆలాపనగా సాగింది.

అదేమాట ఎవరో పెట్టిన శాపంలాగా మిగిలిపోయింది. శ్యామలకు తను పరాయివాడయ్యాడు.

రైలు ఆగిపోయింది. జనం బిలబిల దిగిపోతున్నారు. తను మాత్రం కదల్లేదు. తన ప్రక్కన యింతవరకు కూర్చొన్న ఆసామి బండి దిగుతూ,

"అయ్యా! అడంగుచేరాం!" అంటూ కేక పెట్టాడు. తను ఉలిక్కి పడ్డాడు. అంటే అత్తవారి వూరు వచ్చేసిందన్నమాట. ఈ పాటికి తనకోసం అంతా ఎదురు చూస్తూ వుంటారు.

తన రాకని గురించి జానకి ఏమనుకుంటుందో? "మా వదినే చాలా అందకత్తె" అని తన చెల్లెలు ప్రతి ఉత్తరంలోనూ రాసేది.

ఆనాడు ఆ అందం తనకు ఎక్కడా కనిపించలేదే? కాని తను సరిగ్గా ఆ పిల్లని చూసిందెప్పుడు?

"బావగారు యిక్కడున్నారా?" అంటూ బావమదిరి తన పెట్టెలోకి ఎక్కాడు. కలల్లోంచి తెప్పరిల్లుకుని యీ లోకంలోకి వచ్చాడు.

హల్లో! అని అతన్ని పలుకరించే లోపలే అతను కూలీలని వాళ్ళని పిలిచి సామానుల విషయం అజమాయిషీ చేయడం మొదలు పెట్టాడు.

మామగారు స్టేషనుకు వస్తే బాగుండును అని ఒక్క క్షణం అనిపించింది. కాని యింటి దగ్గర యిచ్చిన ఘనస్వాగతం తనని తానే మరిచిపోయేలాగా చేసింది.

అక్కడ అంతా కనిపించారు. కాని కనిపించనిదల్లా ఆ చిన్నదే! బహుశః సిగ్గేమో!

ఐనా యీ సిగ్గు ఎంత సేపూ?

యీ వింతలన్నీ వెలుగు పుంతలో మాసిపోయేవే కదా!

పాత స్నేహితులకి మల్లే ఎంతో హాయిగా వుండవచ్చు! శ్యామల విషయం విని ఏమంటుందో. తన హృదయాన్ని యింకొక వ్యక్తి అప్పుడే అపహరించిందని తెలుస్తే ఎల్లా ప్రవర్తిస్తుందో!

పూర్వంమల్లే తనని ప్రేమిస్తుందా? జానకి తనని ప్రేమిస్తోందా? ఏమో?

ఈ ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ ఎవరో గదిలోకి ప్రవేశించారు. ఆ వ్యక్తి జానకిలాగా వుంది. చేతుల్లో కాఫీ కప్పు.

కాఫీ కప్పు బల్లమీద పెట్టి అక్కడే తలవంచుకుని నిలబడింది.

"జానకి!" అని అన్నాడు.

కన్నెత్తి రామం వంక చూసింది. ఆ చూపులో ఎటువంటి ఆత్మీయత గాని, ఆపేక్షగాని లేదు.

కూర్చోలేదు. తలవంచుకుని బొటనవ్రేలితో నేల మీద రాస్తూ "మీతో మాట్లాడాలి" అని అంది.

దూరంగా గుడ్లగూబ అరిచింది. రాబందు యింటిమీద ఒక్క క్షణం వాలి మళ్లీ ఎగిరిపోయింది.

జానకి కంఠస్వరం కోయిల కన్న మిన్నగా వున్న తన చెవికి అశనిపాతం లాగా తోచింది.

"చెప్పు జానకి."

"ఇక్కడ కాదు, సాయంకాలం పార్కులో చెబుతాను."

"కూర్చో."

జానకి కూర్చోలేదు. లోపలికి వెళ్లిపోయింది.

రామానికి నవ్వు వచ్చింది. తమ యింట్లో తమకు భయం ఏమిటి? ఐనా సినిమాల్లో నాయికా నాయకులలాగా డ్యూయెట్ పాడుకుంటూ ప్రేమని వెళ్ళడించుకోవాలని జానకి అనుకుంటుందా!

సినిమాలాగా జీవితం ఉండదు. జీవితం లాగా సినిమా వుండదు అని జానకికి తెలియదు కాబోలు.

పెళ్ళిలో అంత హఠాత్తుగా వెళ్ళిపోయానని కోపం వచ్చిందా?

పోని బ్రతిమాలుకుంటాను!

సాయంకాలందాకా జానకి ఆ ఛాయలకు రాలేదు. ఇంట్లో అత్తగారు మామగారు వగైరా వగైరా ఏవేవో రకరకాలుగా పలుకరించి వెళ్లిపోయారు.

రేడియో పెట్టుకుని క్రికెట్ కామెంట్రీ వింటూ కూర్చున్నాడు. సాయంకాలం ప్రొద్దు వాటాలుతూవుండగానే జానకి మళ్లీ కనిపించింది. వెడదామా అని అడిగింది.

పార్కుకి వెళ్ళినంత సేపూ జానకితో ఎన్నో విషయాలు చెబుదామని అనుకున్నాడు. కాని తను అడిగిందల్లా ఒకటే మాట.

"బాగున్నావా జానకి!"

వచ్చిన సమాధానం ఒక చిరునవ్వు మాత్రం!

పార్కు చేరేసరికి చీకటులు ప్రారంభమయ్యాయి. జనసమ్మర్థం అంతగా లేదు. రేడియో లౌడ్స్పీకరు దగ్గర బల్ల మీద ఒక మిలటరీ ఆఫీసరు కూర్చుని వున్నాడు. వీళ్ళయిద్దరిని చూడగానే అతను లేచి నిలబడ్డాడు. జానకి ముఖంలో రవ్వంత ఆందోళన కనిపించింది. కాని అంతలోనే ఆనందం కనిపించింది. అతను వీళ్ళిద్దరిని సమీపించాడు.

జానకి అతన్ని చూపిస్తూ "మేజరు కృష్ణమోహన్" అని అన్నది. వీరు మిస్టర్ రామం!" అని ఉభయులని పరిచయం చేసింది.

అతను షేక్ హ్యాండ్ యిచ్చాడు. "గ్లాడ్ టు మీట్ యూ" అని అన్నాడు. రామం మాట్లాడేలోపలే అతను 'ఎక్స్క్యూజ్‌మీ!' అంటూ అక్కడనుంచి వెళ్లిపోయాడు.

జానకి అతను వెళ్ళిన దిక్కే చూస్తూ నిలబడ్డది.

"ఇంటికి వెడదామా?" అని రామం అడిగాడు. జానకి ఏం మాట్లాడకుండా అతన్ని అనుసరించింది.

ఇంట్లోకి అడుగుపెడుతూ రామం "ఎవరితను!" అని అడిగాడు. "తరువాత చెబుతా" అంటూ జానకి లోపలికి వెళ్ళిపోయింది.

రాత్రి వూరికే రాలేదు. మల్లెపువ్వులాంటి వెన్నెలని, సంపెంగలాంటి సుగంధాన్ని వెంటబెట్టుకుని వచ్చింది. మేడమీద గదిలో తనకు పక్క ఏర్పాటు చేశారు.

"ఈ రాత్రి ఆనంద రాత్రి" అని మనస్సు అడిగింది.

"నాకు తెలియదు" అని హృదయం పలికింది.

కలతలు పోయి వలపులు పారే శుభ సమయమా?

ఈ సందిగ్ధంతో కాలం ఎంతసేపు గడిచిందో తెలియదు. గడవకుండా ఆగిన క్షణం మాత్రం తనకు తెలుసు.

జానకి తన గదిలోకి వచ్చింది. వచ్చి తన సన్నిధిలో నిలబడింది.

"జానకి!" అతను పిలిచాడు. దగ్గరకు రమ్మని చెయ్యిజాపాడు. అందుబాటులో వచ్చికూడా జానకి అందకుండానే నిలబడిపోయింది. తనవంక ఒక్కక్షణం నిశ్చలంగా చూసింది.

"అతను నా భర్త!" అని అన్నది.

రామం ఉలిక్కిపడ్డాడు.

"నాలుగు సంవత్సరాల క్రితం మేము యిద్దరం ప్రేమించుకున్నాం. రెండు సంవత్సరాల క్రితం రహస్యంగా రిజిష్టరు వివాహం చేసుకున్నాం."

"జానకీ" అంటూ రామం వెర్రికేక పెట్టాడు.

"ఆవేశపడకండి. మీకు అన్యాయం చెయ్యకూడదనే యీ మాట చెబుతున్నాను. అతను యుద్ధంలోకి వెళ్లిపోయాడు. అతని ఆచూకీ తెలియలేదు. అధికారులు కూడా అతడు మరణించి వుండవచ్చునని అన్నారు."

"జానకీ!"

"మేమూ అదేమాట నమ్మాం. గుండె రాయి చేసుకున్నాను. మా పెద్దవాళ్ళ ఆనందం కోసమని మీతో వివాహానికి ఒప్పుకున్నాను."

"చాలు జానకీ! ఇహనేం చెప్పవద్దు."

"కాని నేను చెప్పక తప్పదు. రెండు సంవత్సరాలు పాకిస్తాను ఖైదులో అష్టకష్టాలు పడి అతను తిరిగివచ్చాడు. మా యిద్దరి జీవితంలో ఒక్కసారి వెయ్యిదీపాలు వచ్చినంత వెలుగు వచ్చింది."

"నన్నేం చెయ్యమంటావు?"

"అతని ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. అతనికి నేను ఎంతో అవసరం.'

"కాని నువ్వు నన్ను వివాహం చేసుకున్నావు."

"భర్త వుండగా స్త్రీ యింకొక వివాహం చేసుకోవడం మన సమాజం ఒప్పుకోదు."

"నన్ను బెదిరిస్తున్నావా?"

"బెదిరిస్తే నష్టపోయేదాన్ని నేనే. అందుకనే అర్థిస్తున్నాను."

"ఏమని?"

"నాకు విడాకులు యివ్వమని... ఇందులో మీకూ లాభించేది వుంది."

"ఏమిటది?"

"శ్యామలని వివాహం చేసుకోవటానికి మీకు చక్కటి అవకాశం. ఇంతకంటే ఏముంది?"

"శ్యామల!"

"కంగారు పడకండి. నాకు అంతా తెలుసు. అన్నీ తెలుసు."

"తెలిసే చేసుకున్నావా?"

"ఒకరి దుఃఖాన్ని ఒకరు ఓదార్చుకోవచ్చునని అనుకున్నాను."

"నన్ను ద్వేషించావా?"

"జాలిపడ్డాను! మీ మనస్సు ఎంత గాయమైందో అర్థం చేసుకున్నాను."

రామం ఏం మాట్లాడలేదు. కళ్ళ వెంబడి నీరు తిరిగింది. ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు.

"శ్యామల! శ్యామల! ఎందుకని అంతా తన గుండెలు వెయ్యిముక్కలు చేస్తారు?"

"విడాకులు యివ్వలేకపోతే ఆత్మహత్య చేసుకుంటాను!"

"జానకీ!"

"మనసు ఒకరికి, శరీరం యింకొకరికి యివ్వడం నాచేతకాదు."

రామం ఏం మాట్లాడలేదు.

జానకివంక చూస్తూ కూర్చున్నాడు.

"చెదరిన వీణా రవళించేనా?

జీవన రాగం చివురించేనా" ... అంటూ దూరంగా రేడియోలో పాట వినిపిస్తోంది.

రామం మనస్సులోంచి ఒక నిట్టూర్పు వచ్చింది. జానకి ముఖంలో ఒక ఆశాకిరణం వెల్లివిరిసింది. రామం ఒకే ఒక మాట అన్నాడు. జానకి చప్పున వంగి అతని పాదాలకు నమస్కరించింది.

"కలకాలం బ్రతుకు జానకీ."